సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 21 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం | 27.04.2025




## రాజకీయాల్లోకి కొత్తతరం రావాలి

- అప్పుడే దేశ ప్రగతి ముందుకు సాగుతుంది
- భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో
- లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్
- ఘనంగా స్వాగతం పలికిన సీఎం రేవంత్ రెడ్డి

2 లో



## 'సీతారామ'కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- తెలంగాణ చరిత్రలో కీలక అభివృద్ధి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

2 లో

## 'భూ భారతి' సమగ్ర చట్టం : కలెక్టర్



3 లో

wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

General News

# రాజకీయాల్లోకి
# కొత్తతరం రావాలి

- అప్పుడే దేశ ప్రగతి ముందుకు సాగుతుంది
- భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో రాహుల్
- ఘనంగా స్వాగతం పలికిన సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని, అప్పుడే దేశ ప్రగతి ముందుకు సాగుతందని లోక్ సభ ప్రతి పక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆకాంక్షించారు. గత పదేళ్లలో ప్రపంచ రాజకీయాలు మారిపోయాయన్నారు. ఆధునిక సామాజిక మాధ్యమాలతో అంతా మారిపోయిందన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో కొనసాగుతున్న భారత్ సమ్మిట్ లో ఆయన మాట్లాడారు. రాజకీయాల్లోకి కొత్తతరం రావాలని ఆకాంక్షించారు. అప్పుడే కొత్త ఆలోచనలు పుట్టుకొచ్చి, దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వంపై మండిపాటు వ్యక్తం చేశారు. 'ప్రపంచ వ్యాప్తంగా రాజకీయాలు ఎంతో మారిపోయాయి. పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు. విపక్షాలను అణగదొక్కడమే అధికార పార్టీకి పనైపోయింది. మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు వేశారు' అంటూ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎన్నికలకు ముందు కన్యాకుమారి నుంచి సుమారు 4 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు రాహుల్ గుర్తు చేసుకున్నారు. పాదయాత్రకు ముందు చాలా ఆలోచించానని, అయితే, మొదలు పెట్టిన తర్వాత వెనకడుగు వేయలేదని అన్నారు. ఆ తర్వాత చాలా మంది తనతో కలిసి నడవడం మొదలు పెట్టినట్లు చెప్పారు. భారత్ సమ్మిట్ 2025కు నిన్ననే రావాల్సి ఉండే.. కానీ, కాశ్మీర్ కి వెళ్లాను.. క్షమించండి.. ఈ సమ్మిట్ నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెప్పారు. ఇక, రాజకీయాల్లో కొత్త జనరేషన్ రావాలి.. ప్రజాస్వామ్య రాజకీయాలు ప్రపంచవ్యాప్తంగా మారిపోయాయి.. పదేళ్ల క్రితం నాటి పరిస్థితులు ఇప్పుడు లేవు అని ఆయన తెలిపారు. ఇక, భారత్ జోడో యాత్రలో 4 వేల కిలోమీటర్లు నడిచా.. కన్యాకుమారి నుండి పాదయాత్ర మొదలు పెట్టా.. 10 రోజుల తర్వాత చూస్తే నాతో పాటు నడిచే వారి సంఖ్య పెరిగిపోయింది.. ఈ యాత్రలో ఎన్నో విషయాలు తెలుసుకున్నాను.. సగం దూరం నడిచేటప్పటికి నేను గతంలో లాగా లేను.. ప్రజలతో ఎలా మాట్లాడాలో.. వారి సమస్యలు ఎలా వినాలో నేర్చుకున్నా.. నేను గతంలో ఎప్పుడూ ప్రజలపై ఉన్న ప్రేమను వ్యక్తపరచలేదు అని రాహుల్ గాంధీ వెల్లడిరచారు. కానీ, ఈ పాదయాత్రలో నేను ప్రజలపై నా ప్రేమను వ్యక్త పరచగలిగాను అని రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. నేను ఎప్పుడైతే ప్రజలపై నా ప్రేమను వ్యక్తపరిచానో అప్పటినుంచి అందరూ స్పందిస్తున్నారని తెలిపారు. యాత్రలో కొన్నిసార్లు స్టక్ అయ్యాను.. అప్పటి నుంచి నన్ను చాలా మంది ఇష్టపడటం మొదలు పెట్టారు.. ఓ చిన్న అమ్మాయి వచ్చి లవ్ యూ అని చెప్పింది.. ఆ తర్వాత నేను కూడా నా ఇష్టాన్ని ఎక్స్ ప్రెస్ చేస్తూ వచ్చాను అన్నారు. శుక్రవారం ప్రారంభం అయిన ఈ కార్యక్రమంలో 100 దేశాలకు చెందిన 450 మంది ప్రముఖులు పాల్గొన్నారు. సమ్మిట్ చివరి రోజున ఈ గ్లోబల్ కాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అంతకు ముందు విమానాశ్రయంలో ఆయనకు సిఎం రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క తదితరులు స్వాగతం పలికారు.

# సీతారామ ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- తెలంగాణ చరిత్రలో కీలక అభివృద్ధి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల శాఖ అనుమతి ఇచ్చిందని.. ఇది తెలంగాణ ఇరిగేషన్ చరిత్రలో లాండ్ మార్క్ డెవలప్‌మెంట్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నాడు మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ఏడాదిన్నర కృషి ఫలించిందన్నారు. ఇరిగేషన్ శాఖలో ఇది ముందడుగని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు చాలా కాలంగా గోదావరి జలాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గోదావరి నదీ జలాలలో 68 టీఎంసీలు.. 8 లక్షల ఎకరాలకు ఉపయోగమని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో మేడిగడ్డ కూలిపోయిందని..సీతమ్మ సాగర్ నిలబడుతుందా అని కేంద్రం అడిగిందన్నారు. సీడబ్ల్యూసీకి అన్ని వివరాలు పంపితే అప్పుడు అప్రూవల్ ఇచ్చారని వెల్లడిరచారు. పోలవరం బ్యాక్ వాటర్ విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. ముంపు నష్టం.. ప్రొటెక్షన్ వాల్ కోసం కేంద్రం నిధులు ఇవ్వాలని అడిగామని.. అందుకు కేంద్రం కొంత అనుకూలంగా ఉందని తెలిపారు. కృష్ణా జలాల వాటాలో తెలంగాణ రైతులకు బీఆర్ఎస్ ద్రోహం చేసిందని విమర్శించారు. తెలంగాణకు ఎక్కువ భాగం ఇవ్వాలని ట్రిబ్యునల్ ముందు వాదిస్తున్నామన్నారు. అంతరాష్ట్ర సమస్యలపై ప్రభుత్వం సీరియస్‌గా వర్కౌట్ చేస్తోందన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదికపై బీఆర్ఎస్ మాట్లాడే తీరు ఖండిస్తున్నామన్నారు. తుమ్మిడి హెట్టి దగ్గర తాము ప్రాజెక్ట్ మొదలుపెట్టామని.. బీఆర్ఎస్ తమకు పేరు వస్తుందని రీడిజైన్ చేసి... లక్షన్నర కోట్లకు పెంచారని అన్నారు. కాళేశ్వరం కట్టిన డబ్బు బీఆర్ఎస్ వాళ్ళ జేబులో నుంచి కట్టలేదన్నారు. తెలంగాణ ప్రజల భవిష్యత్ తాకట్టు పెట్టి మరీ కట్టారని మండిపడ్డారు. వాళ్ళే కట్టారు.. వాళ్ల హయంలోనే కూలిందని అన్నారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ చూస్తే ఎంత దుర్మారం చేశారో అర్థం అవుతోందన్నారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్‌లో విషయాలు తెలంగాణ ప్రజలు గుర్తించాలని అన్నారు. ప్రాజెక్టును తుమ్మిడి హెట్టి నుంచి షిఫ్ట్ చేసి అన్యాయం చేశారని..ద్రోహం చేశారని మండిపడ్డారు. మేడిగడ్డనే కాదు.. సుందిళ్ళ, అన్నారం కూడా ప్రమాదంలో ఉందని ఎన్‌డీఎస్ఏ చెప్పిందని తెలిపారు. లక్ష కోట్లు దోపిడి చేసిన వాళ్లకు ఎలాంటి శిక్ష వేయాలో ఆలోచించాలన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక ప్రకారం ముందుకు వెళ్తామని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో దీనిపై సమీక్ష చేస్తామన్నారు. బీఆర్ఎస్ లాగా చిల్లర ఆలోచనలు తమకు ఉండవన్నారు. 'మీ సభ ఎప్పుడూ ఉందో ఎన్‌డీఎస్ఏకు ఏం తెలుసు. అబద్ధపు మాటలు ఆపండి. ఎన్‌డీఎస్ఏ సూచనలే మేము నమ్ముతాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.



# కాంట్రాక్టర్లను కాపాడుకోవాలి

**నల్లగొండ, మనచౌరాస్తా :** ప్రభుత్వ అభివృద్ధిలో పాలుపంచుకునే కాంట్రాక్టర్లను రక్షించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు డివిఎన్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఎం ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్ లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నల్గొండ సెంటర్ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కాంట్రాక్టర్ల సమస్యలపై చర్చించాలని, వారి బిల్లులు చెల్లించడం జఠిలంగా అయినాయని, జిల్లా మంత్రులైన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పౌరసరఫరాల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి జిల్లా అభివృద్ధిలో వివిధ పనులు చేసే కాంట్రాక్టర్లను రక్షించుకోవడంతో పాటు చిన్న కాంట్రాక్టర్లు రాష్ట్రం మొత్తంలో మెయింటెనెన్స్ కాంట్రాక్టర్లు ఆర్ అండ్ బి లో 100 కోట్లు ఇస్తే 2200 బిల్లులు క్లియర్ అవుతాయన్నారు. రోడ్ల మరమ్మతులకు ఐదు వేల నుంచి 20 లక్షల వరకు ఉన్నాయని, వాటిని వెంటనే ఇప్పించాలని ముఖ్యమంత్రిని ఇతర మంత్రులను వేడుకుంటున్నామని తెలిపారు. చిన్న కాంట్రాక్టర్ల బిల్లు ఇచ్చి వారికి తోడ్పాటు అందించాలని అన్నారు. కాంట్రాక్టర్లకు వర్క్ షాప్ ఏర్పాటు చేసి ఎంత డబ్బులు ఇస్తారో ఏమేమి పనులు చేయాలో నిర్ణయిస్తే పనులు చేసి ప్రభుత్వానికి ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. రాష్ట్రంలో లక్ష మందికి కాంట్రాక్టర్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా మూడు లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని వారిని రక్షించుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన డివిఎన్ రెడ్డిని జిల్లా సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ కృష్ణారావు, సిడిఐ చైర్మన్ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి కోశాధికారి సంతోష్‌రెడ్డి, నలగొండ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి రంగారావు, సత్యనారాయణ, మెదక్ జిల్లా బాధ్యులు సత్యమయ్య, కోకాపేట వినయ్ రెడ్డి పాల్గొన్నారు.

# శివునిపల్లి కార్యదర్శి సస్పెండ్

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ మండలం శివుని పల్లి కార్యదర్శి టి.శ్రీకాంత్ ను విధుల నుంచి తొలగించినట్టు డీపీఓ నాగపురి స్వరూప ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన కె.ఉమారాణి ఫిర్యాదు మేరకు విచారణ జరిపినట్లు తెలిపారు. పంచాయతీ నిధులను రూ.18.79 లక్షలను స్వంత ఖాతాలోకి మార్చుకోవడం, రూ.10 లక్షల 551 వసూలు చేసిన పన్నులలో రూ.54,987 మాత్రమే జీపీ ఖాతాలో జమ చేసి చేసినట్లు విచారణలో తేలడంతో అతడిని సస్పెండ్ చేస్తున్నట్లు డీపీఓ తెలిపారు.

# 'ఎర్త్' ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

**జనగామ, మన చౌరాస్తా :** సే నో డ్రగ్స్ నినాదంతో జనగామ జిల్లాలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ డైరెక్టర్ మంగళంపల్లి రాజు తెలిపారు. ఈ మేరకు శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. స్థానిక ప్రిస్టన్ గ్రౌండ్ లో నిర్వహించే ఈ పోటీలకు ఎంట్రీ ఫీజు ఏమీ లేదన్నారు. రూ.10,000 ప్రథమ బహుమతి, రూ.5000 ద్వితీయ బహుమతి ఇవ్వబడుతుందన్నారు. గ్రామీణ యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పోటీలను సక్సెస్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యువజన నాయకుడు యాసరపు కర్ణాకర్, చౌదరం గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజు, గ్రామ యువత, ఎర్త్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

General News



# 'భూ భారతి' సమగ్ర చట్టం

- ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి.. ఓ సమగ్ర చట్టం అని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. జనగామ పట్టణంలోని గాయత్రి గార్డెన్‌లో శనివారం భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూ భారతి చట్టం మీద రెవెన్యూ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఆ తర్వాత కొందరు రైతులు తమ సమస్యల పరిష్కారం గురించి కలెక్టర్‌ను అడగగా.. భూ భారతి ద్వారా.. వారివారి సమస్యలను ఎలా పరిష్కరించుకోవచ్చో కలెక్టర్ వివరించారు. సందేహాల నివృత్తి అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి చట్టంలో అప్పీల్ వ్యవస్థ లేదని.. కోర్టులకే ఆశ్రయించాల్సి వచ్చేదని.. కానీ భూ భారతి చట్టంలో ఉన్న అప్పీల్ వ్యవస్థ ద్వారా దాదాపు జిల్లా పరిధిలోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ధరణిలో ప్రతీ దరఖాస్తు కలెక్టర్ల వద్దకే వచ్చేదని, కానీ భూ భారతి ద్వారా తహసీల్దార్, ఆర్డీఓ వద్దే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. మే చివరిలోగా ప్రతీ గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చి భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తు లను స్వీకరిస్తారన్నారు. స్వీకరణ అనంతరం విచారణ జరిపి భూ భారతి ద్వారా ఆ సమస్యలను పరిష్కరిస్తారన్నారు. భూ భారతి చట్టం ద్వారా వారసత్వ భూముల విచారణకి సంబందించి, రిజిస్ట్రేషన్ డాక్యూమెంట్ లో ఆ భూమి వారికి ఎలా వచ్చిందో సంబంధిత వివరాలు, సర్వే మ్యాప్ పొందుపరచడం జరుగుతుందన్నారు. తద్వార భవిష్యత్ లో ఎలాంటి సమస్యలు రావన్నారు. పాస్ బుక్ లో కూడా మ్యాప్ ఉంటుందని, దీని ద్వారా భవిష్యత్ లో ఆ భూమి ని కొనాలన్న, అమ్మాలన్న చాలా సులభమన్నారు. త్వరలో గ్రామ పరిపాలన అధికారి గ్రామాలలో అందుబాటులో ఉంటారని, వారి ద్వారా ప్రతీ భూ సమస్య తమ దృష్టికి వస్తాయన్నారు. ఆన్‌లైన్ లోనే కాకుండా అఫ్ లైన్ లో కూడా రెవెన్యూ రికార్డ్ లను భద్రపరుస్తాన్నారు. తెల్ల కాగీతం మీద భూమి కొని రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న, సాద బైనామా దరఖాస్తులకు భూ భారతి ద్వారా ఉపశమనం కలుగుతుందన్నారు. వ్యవసాయేతర భూములకు ప్రాపర్టీ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని వల్ల వారు లోన్ పొందడం, మరెన్నో ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ఈ సదస్సులో ఆర్డీఓ గోపీరామ్, తహసీల్దార్ హుస్సేన్, జనగామ మార్కెట్ చైర్మన్ శివరాజ్ యావద్, డైరెక్టర్ బొట్ల నర్సింగరావు, ఆర్టీఏ మెంబర్ అభిగౌడ్, ఆర్ఐ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లు ఆలస్యం కావద్దు

- స్వయంగా ఫోన్ చేసి తెలుసుకున్న కలెక్టర్
- హర్షం వ్యక్తం చేసిన రైతు నర్సింగరావు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలం వడ్లకొండ, శామీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా.. జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం అమ్మగా కొందరి రైతుల ఖాతాలో నగదు జమ అయ్యాయి. ఈ సందర్భంగా జనగామ మండలం శామీట్ పేటకు నర్సింగ్ రావు అనే రైతుకు కలెక్టర్ స్వయంగా ఫోన్ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మినందుకు, ఆ డబ్బులు అతి త్వరగా తన ఖాతాలో జమ అయినందుకు రైతు స్పందనను అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు ఈ సెంటర్ కి ధాన్యం తీసుకొచ్చారు.. ఎప్పుడు అమ్మారు అని.. నగదు ఎప్పుడు మీ ఖాతా లోకి జమ అయ్యాయా అని రైతు మాటల్లో కలెక్టర్ తెలుసుకున్నారు. ఇందుకు ఆ రైతు స్పందించి ఈ నెల 10న సెంటర్ కి 30 కింటాళ్ల 80 కిలోల ధాన్యం తెచ్చి 12వ తేదీన తాలు పట్టానని, 13న మొత్తం 77 బస్తాలకు కాంట అయ్యాయని తెలిపారు. 18న తన ఖాతాలోకి రూ.71 వేల నగదు జమ అయ్యాయని, ఇంత తొందరగా డబ్బులు పడినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్మి .. మద్దతు ధర పొందాలని, బయట దళారుల చేతిలో మోసపోవద్దని



సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్డీఓ గోపీరామ్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 14వ వార్డులో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక జరగాలని కలెక్టర్ వెరిఫికేషన్ టీంకు సూచించారు.



## అమ్మాపురం.. ఆడబిడ్డను...

**జనగామ, మన చౌరాస్తా :** బీఆర్‌ఎస్ రజతోత్స సభకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. జనగామ జిల్లా నేతల ఫ్లెక్సీలు, కటౌట్లతో గులాబిమయంగా మారింది. జిల్లా నేతలే కాక హైదరాబాద్‌కు చెందిన లీడర్లు సైతం ఈ ప్రాంతంలో భీరీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌కు 9వ డివిజన్‌కు చెందిన కార్పొరేటర్ పి.రజిత రవికాంత్ జనగామ - హైదరాబాద్‌లోని ప్రధాన రహదారిపై రజతోత్సవ సభకు ఆహ్వానం పలుకుతూ భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆమె జనగామ జిల్లా నర్మెట మండలం అమ్మాపురం ఆడబిడ్డగా అందులో పేర్కొంటూ సొంతూరుపై తమకు ఉన్న ప్రేమను వ్యక్తం చేయడం విశేషం.



## హత్య కేసు నిందితుడు అరెస్టు

**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగుల తండాలో ఈనెల 20న గుగులోతు శ్రీనును అదే తండాకు చెందిన జైత్రం దారుణంగా హత్య చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా.. ఆయా కేసు వివరాలు శనివారం పాలకుర్తి పోలీస్ స్టేషన్లో సిఐ మహేందర్ రెడ్డి వెల్లడించారు. మృతుడు శీనుకు జైత్రంకు గత కొన్నేళ్లుగా భూతగాదాలతో పాటు ఇతర కారణాలతో మనస్పర్ధలు ఉన్నాయి. ఎడ్లను జైత్రం స్థలంలో కట్టేయగా.. ఇటీవల ఈ విషయంపై ఇద్దరి మధ్యన మరోసారి ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పగ పెంచుకున్న జైత్రం ఎలాగైనా సీనులో హతమార్చాలని పన్నాగం పన్నాడు. 20 న ఆదివారం రాత్రి ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా ఆటోలో వచ్చి కత్తితో దాడికి పాల్పడ్డాడు. శరీరంపై తీవ్ర గాయాలతో అక్కడికక్కడే శ్రీను మృతి చెందాడు. అనంతరం కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇవాళ నిందితుడిని పట్టుకుని మీడియా ముందు ప్రవేశపెట్టారు. హత్యకు ఉపయోగించిన ఆటో, కత్తిని స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ కు పంపించామని సిఐ తెలిపారు. కేసులు చేదించిన పాలకుర్తి, కొడకండ్ల పోలీసులను డీసీపీ రాజమహేంద్ర నాయక్ అభినందించారు.



## జనగామలో కొవ్వొత్తుల ర్యాలీ

**జనగామ, మన చౌరాస్తా :** పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ జనగామ కవులు కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం జనగామ అంబేద్కర్ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు.



# శర్వానంద్‌తో అనుపమ మరోసారి..

టాలీవుడ్ నటుడు శర్వానంద్ తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా చిత్రం చేయబోతున్న విషయం తెలిసిందే. సంపత్ నంది ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. 1960ల చివర్లో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన కథ ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. మరపురాని అనుభూతిని కలిగించే పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రాబోతుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఇప్పటికే మూవీ కోసం పూర్తిగా మేకోవర్ అయ్యాడు శర్వానంద్. మే మొదటివారం నుంచి షూటింగ్ శరవేగంగా ప్రారంభం కాబోతుండగా.. ఈ సినిమా కోసం హైదరాబాద్ సమీపంలో 15 ఎకరాల్లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేశారు. ఇదిలావుంటే ఈ మూవీలో కథానాయికకు సంబంధించి సాలిడ్ అప్‌డేట్ వచ్చింది. ఈ మూవీలో హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. గతంలో శర్వానంద్, అనుపమ కలిసి శతమానం భవతి అనే సినిమాలో నటించారు. దిల్ రాజ్ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ జోడి మళ్లీ జత కడుతుండడంతో భారీ అంచనాలున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్.ఎస్, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్ .